సాక్షి
అనంతపురం
మంగళవారం ♦ 6 ♦ ఆగస్టు ♦ 2024



చీనీ టన్ను రూ.17,150

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17,150 పలికాయి.



టమాట కిలో రూ.23

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.12, నరాసరి రూ.18 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.1°/24.6°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికం గా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

టీబీ డ్యాం @ 100 టీఎంసీలు



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో 100.410 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. ఆదివారం 1,32,202 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో సోమవారం సాయంత్రానికి 82,780 క్యూసెక్కులకు తగ్గింది. 12 క్రస్ట్ గేట్లు రెండు అడుగులు ఎత్తి 50,156 క్యూసెక్కుల నీటిని నదికి వదులుతున్నారు.మరోవైపు, హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద 1,360 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

బీసీ గురుకులాల్లో అడ్మిషన్లు పూర్తి

అనంతపురం ఎడ్యుకేషన్: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో అన్ని తరగతుల అడ్మిషన్లు జూలై 31 నాటికే పూర్తయ్యాయని గురుకులాల జిల్లా కన్వీనర్ పీఎంకే సంగీతకుమారి స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశానికి పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లను భర్తీ చేశామన్నారు. మిగులు సీట్లకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక, ప్రజాప్రతినిధుల గ్రీవెన్స్‌ను పరిశీలించి మెరిట్, రిజర్వేషన్‌ను అనుసరిస్తూ కేటాయించామన్నారు.అలాగే 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లను బ్యాక్ లాగ్ ఎంట్రెన్స్ పరీక్ష ద్వారా 1:2 ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహించి మెరిట్ జాబితా ప్రకారం భర్తీ చేశామని స్పష్టం చేశారు. జిల్లాలో ఏ స్కూల్ లోనూ, ఏ తరగతిలోనూ ఒక్కసీటూ ఖాళీ లేదని పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

జేఎన్‌టీయూలో ఆరుగురి విద్యార్థుల సస్పెన్షన్



అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మెకానికల్ ఫైనలియర్ చదువుతున్న ఆరుగురు విద్యార్థులను హాస్టల్ నుంచి సస్పెండ్ చేశారు. శనివారం రాత్రి వీరు మెకానికల్ ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో గొడవకు దిగారు. ఒక విద్యార్థిని గాయపరిచారు. దీనిపై 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలోనే ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ వెంటనే చర్యలు తీసుకున్నారు. విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. సోమవారం కళాశాలలో సమావేశమైన కమిటీ.. ఘటనకు ఆరుగురు విద్యార్థులు బాధ్యులుగా గుర్తించింది. క్రమశిక్షణ చర్యల కింద హాస్టల్ నుంచి వీరిని సస్పెండ్ చేయాలని నిర్ణయించింది. ఫైనలియర్ విద్యార్థులకు నాలుగు నెలల్లో కోర్సు పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని క్లాస్ వర్క్ సస్పెండ్ చేయకుండా హాస్టల్ నుంచి మాత్రమే సస్పెండ్ చేశారు. గొడవలు పునరావృతమైతే కోర్సు నుంచి కూడా సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.

ఆదాయంపై కన్నేసి.. అడ్డుపుల్ల వేసి



సోలార్ ప్లాంట్ (ఫైల్)

టీడీపీ నాయకులు ఆదాయ మార్గాలపై కన్నేశారు. ధన దాహంతో ప్రతి పనిలోకీ దూరిపోతున్నారు. తమ పంతం నెగ్గించుకునేందుకు అడ్డుపుల్లలు వేస్తున్నారు. తాజాగా తాడిపత్రి మండలంలో ఏర్పాటు కానున్న సోలార్ ప్లాంట్ విషయంలో కూడా తలదూర్చారు. భూముల సేకరణ జరగకుండా మోకాలడ్డారు. ఇప్పటికే సేకరించిన భూముల లీజుల రద్దుకు పావులు కదుపుతున్నారు. దీంతో సోలార్ కంపెనీల ప్రతినిధులు గగ్గోలు పెడుతున్నారు.

- సోలార్ ప్లాంటుకు భూముల సేకరణలో టీడీపీ నేతల అడ్డుపుల్ల
- పంచాయితీల పేరుతో కాలక్షేపం
- ఇప్పటికే చేసుకున్న భూముల లీజు రద్దుకు కుయుక్తులు
- ఘొల్లుమంటున్న కంపెనీ ప్రతినిధులు

తాడిపత్రి రూరల్: జిల్లాలోని తాడిపత్రితో పాటు వైఎస్సార్ జిల్లాలోని పలు గ్రామాల సమీపంలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు కోసం గత ప్రభుత్వ హయాంలో సెల్, టాటా, అక్సీమీ కంపెనీలు ముందుకు వచ్చాయి. ఇందుకోసం వైఎస్సార్ జిల్లా సరిహద్దు గ్రామాలైన కోడూరు, సిరిగేపల్లి, మునుగాంపల్లితో పాటు మన జిల్లా సరిహద్దులోని బోడాయిపల్లి, వెలమకూరు, ఆలూరు సమీపంలో భూములను రైతుల నుంచి లీజుకు తీసుకోవాలని నిర్ణయించాయి. ఈ క్రమంలోనే దాదాపు ఐదు వేల ఎకరాల సేకరణ కోసం తమ ప్రతినిధులను రంగంలోకి దించాయి. ఆయా కంపెనీల ప్రతినిధులు తొలుత వైఎస్సార్ జిల్లాలోని కోడూరుకు చెందిన నాయకులను సంప్రదించారు. భూములను 30 ఏళ్ల లీజుకు మాట్లాడుకుని, అందుకు ఏడాదికి ఎకరాకు రూ.30,500 చొప్పున అందించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. దాదాపు 2,500 ఎకరాల్లో భూ సమీకరణ తుది దశకు వచ్చింది.

టీడీపీ నేతల అడ్డుపుల్ల

మిగిలిన 2,500 ఎకరాల భూమి సమీకరణ కోసం తాడిపత్రి సరిహద్దు గ్రామాలపై ఆయా కంపెనీల ప్రతినిధులు దృష్టి పెట్టారు. ఎన్నికలకు ముందు ఇక్కడి 3 గ్రామాల్లో సర్వే కూడా చేశారు. అప్పట్లో జిల్లాకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, వైఎస్సార్ జిల్లా నాయకులు సామరస్యంగా ముందుకు సాగడంతో పని సులువైంది. ఈ క్రమంలో రైతులకు అడ్వాన్స్ కింద రూ. 5 వేల చొప్పున కంపెనీ ప్రతినిధులతో అందించారు. అయితే, భూములకు సంబంధించిన లీజు అగ్రిమెంట్లను రైతుల నుంచి తీసుకునే సమయంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. ఈ క్రమంలోనే పెద్దపప్పూరు మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు తెరపైకి వచ్చారు. భూముల అగ్రిమెంట్లపై మోకాలడ్డారు. తమ నియోజకవర్గంలో భూములను తామే సేకరించి కంపెనీ ప్రతినిధులకు అప్పగిస్తామని, ఈ విషయంలో వైఎస్సార్ జిల్లా నేతల పెత్తనమేంటని ఎదురు తిరిగారు. ఇటీవల తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వద్ద పంచాయితీ పెట్టారు. సమస్య పరిష్కరించాల్సిన ఆయన.. చూద్దాంలే అంటూ వాయిదా వేస్తున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు సేకరించిన భూములకు సంబంధించిన లీజు అగ్రిమెంట్ల రిజిస్ట్రేషన్‌ను సమస్య తెగేంత వరకు నిలుపుదల చేయాలని తాడిపత్రి సబ్ రిజిస్ట్రార్‌కు మౌఖిక ఆదేశాలు వచ్చాయని తెలిసింది. ఇప్పట్లో భూసేకరణ వ్యవహారం తేలేటట్టు కనిపించకపోవడంతో ఆయా సోలార్ కంపెనీల ప్రతినిధులు బోరుమంటున్నారు. ఎంతో కష్టపడి భూముల సేకరణ చివరి దశకు తీసుకువచ్చామని, ఈ క్రమంలో అడ్డుపుల్ల వేయడం బాధాకరమంటూ కుమిలిపోతున్నారు.

రద్దు ఆదేశాలేవీ లేవు



సోలార్ ప్లాంట్ భూములకు సంబంధించి తాడిపత్రి మండలంలోని బోడాయిపల్లి,వెలమకూరు, ఆలూరుకు చెందిన రైతుల నుంచి కంపెనీలు చేసుకునే లీజు అగ్రిమెంట్లను నిలుపుదల చేయాలని ఎవరూ నన్ను ఆదేశించలేదు. లీజు అగ్రిమెంట్లు చేయాలని కంపెనీ ప్రతినిధులు కానీ, రైతులు కానీ నా వద్దకు రాలేదు. ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అగ్రిమెంట్లను రిజిస్టర్ చేయడానికి ముందుంటా.

– శివ నారాయణ,
సబ్ రిజిస్ట్రార్, తాడిపత్రి

కామాంధుడికి ఐదేళ్ల జైలు

- రూ. 5 వేల జరిమానా

అనంతపురం: బాలికపై అత్యాచారం చేయడమే కాకుండా కత్తిపీటతో గొంతుకోసిన ఓ కామాంధుడికి 5 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ సెషన్స్ జడ్జి ఆర్. రాజ్యలక్ష్మి తీర్పు వెలువరించారు. వివరాలు.. పెద్దవడుగూరు మండలం గుత్తి అనంతపురం గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన నాగేశ్వర కుమారుడు తపిల రామాంజనేయులు 2020 మే 8న బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక తల్లిదండ్రులిద్దరూ కూలి పనుల నిమిత్తం వెళ్లిన విషయం గమనించిన నిందితుడు.. వారి ఇంట్లోకి దూరి దారుణానికి ఒడిగట్టాడు. ఈ క్రమంలోనే కత్తిపీటతో బాలిక గొంతు కోశాడు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రాగా, అక్కడి నుంచి పారిపోయాడు. దీనిపై పెద్దవడుగూరు పోలీసుస్టేషన్‌లో అప్పటి ఎస్‌ఐ నారాయణ నాయక్ కేసు నమోదు చేయగా, సీఐ రవిశంకర్ రెడ్డి దర్యాప్తు చేశారు. అనంతపురంలోని స్పెషల్ సెషన్స్ జడ్జి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. బాధితుల తరఫున స్పెషల్ పీపీ కే. విద్యాపతి వాదనలు వినిపించారు. పూర్వాపరాలు పరిశీలించిన జడ్జి ఆర్. రాజ్యలక్ష్మి సోమవారం తీర్పు వెలువరించారు. ఐపీసీ 452వ సెక్షన్ కింద ఐదు సంవత్సరాల శిక్ష.. రూ.1,000 జరిమానా, 307 సెక్షన్ కింద 5 సంవత్సరాల శిక్ష.. రూ.1,000 జరిమానా, 354 –ఏ సెక్షన్ కింద సంవత్సరం శిక్ష.. రూ.1,000 జరిమానా, 354–డీ కింద ఒక సంవత్సరం శిక్ష.. రూ.500 జరిమానా, సెక్షన్ 7 ఆర్/డబ్ల్యూ 8 ఆఫ్ పోక్సో యాక్ట్ కింద 5 సంవత్సరాల శిక్ష.. రూ.1,000 జరిమానా విధించారు. పై శిక్షలు ఏకకాలంలో అమలవుతాయని స్పష్టం చేశారు. దీంతో నిందితుడు 5 సంవత్సరాల శిక్ష అనుభవించాలని, రూ.5 వేల జరిమానా చెల్లించాలని ఆదేశించారు. బాధితురాలికి రూ. 5 లక్షల పరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి సూచించారు. సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టి ముద్దాయికి శిక్ష పడేలా చేసిన అందరినీ ఎస్పీ మురళీకృష్ణ అభినందించారు.

పంచాయతీరాజ్ స్ఫూర్తికి తూట్లు

- జెడ్పీ అధికారుల ఇష్టారాజ్యం
- తోచినట్లుగా స్థాయీ సంఘాల సమావేశాల నిర్వహణ
- రెండు నెలలకోసారి జరగాల్సిన సమావేశాలు 6 నెలలైనా ఊసేలేదు
- 6 నెలల క్రితం సభ్యులు బహిష్కరించిన సమావేశాన్ని నిర్వహించినట్లు తప్పుడు నివేదికలు
- పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం



అనంతపురం సిటీ: జెడ్పీ ముఖ్య అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పంచాయతీ రాజ్ చట్టం స్ఫూర్తిని కాలరాస్తున్నారు. తమకు తోచినట్లుగా స్థాయీ సంఘాలు, సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తున్నారు. అధికారుల తీరు ఉభయ జిల్లాల్లో చర్చనీయాంశమవుతోంది. చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన వారే తూట్లు పొడుస్తున్న తీరు వివాదాస్పదమవుతోంది. గతంలో జెడ్పీ సీఈఓగా పని చేసిన భాస్కర్‌రెడ్డి సమావేశాలను సక్రమంగా నిర్వహించకుండా పని దినాలను ప్రామాణికంగా తీసుకొని నడుపుతూ వచ్చారు. ఆయన సస్పెండయ్యాక వచ్చిన సీఈఓలు సైతం అదే బాటలో పయనిస్తున్నారు. ఐఏఎస్ అధికారి సీఈఓగా వచ్చినా తీరు మారలేదు.

6 నెలలు దాటినా..

ప్రతి 60 రోజులకోసారి (రెండు నెలలు) స్థాయీ సంఘాల సమావేశాలు, 90 రోజులకోసారి(మూడు నెలలు) సాధారణ సర్వసభ్య సమావేశాలు నిర్వహించాలని పంచాయతీరాజ్ చట్టం చెబుతోంది. పని దినాలతో సంబంధం లేకుండా సమావేశాలు కచ్చితంగా నిర్వహించాలని పేర్కొంటోంది. కానీ, గత సమావేశాలు జరిగి ఇప్పటికి 6 నెలలు గడిచాయి. అయినా, సమావేశాల నిర్వహణపై అధికారులు నోరు మెదపకపోవడం గమనార్హం.

జరగని సమావేశం జరిగినట్లుగా..

కొత్త పాలక వర్గం ఏర్పడ్డాక ఇప్పటి వరకు మొత్తం 11 సార్లు స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 29న నిర్వహించిన స్థాయీ సంఘాల సమావేశాలను పాలకవర్గ సభ్యులు బహిష్కరించారు. అప్పటి జెడ్పీ సీఈఓ, ప్రస్తుత డిప్యూటీ సీఈఓ తీరును నిరసిస్తూ, వారిని సరెండర్ చేయాల్సిందేనంటూ సభ్యులందరూ మూకుమ్మడిగా డిమాండ్ చేశారు. దీంతో సమావేశాలు వాయిదాపడ్డాయి. జరిగింది ఇలా ఉంటే, సమావేశాలు నిర్వహించినట్లుగా జెడ్పీ అధికారులు తప్పుడు నివేదికలు సిద్ధం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ సంతకం కోసం పంపగా ఆమె అభ్యంతరం తెలిపారు. సాధారణంగా స్థాయీ సంఘాల సమావేశాలు కోరం లేకనో, మరే ఇతర కారణాల వల్లనో వాయిదాపడితే మరుసటి రోజు సమావేశాలు నిర్వహించాలని పంచాయతీరాజ్ చట్టంలో స్పష్టంగా ఉంది. లేదంటే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయనీ పేర్కొన్నారు. అయితే, ఇక్కడ మాత్రం సమావేశాల నిర్వహణకు ప్రయత్నాలేవీ జరగలేదంటేనే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు.

కలెక్టర్ అయినా స్పందిస్తారా..?

తప్పుడు నివేదికలు సిద్ధం చేసిన ఉదంతంపై జెడ్పీ పాలకవర్గం పంచాయతీరాజ్ కమిషనర్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదులు పంపారు. అయినా అక్కడి నుంచి కనీస స్పందన కూడా లేదని సమాచారం. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ అయినా స్పందించి జెడ్పీ అధికారుల పని తీరులో మార్పు తీసుకొచ్చి, పంచాయతీ రాజ్ చట్ట స్ఫూర్తిని కొనసాగించాలని పలువురు కోరుతున్నారు.

సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారు



సమావేశాలు నిర్వహించాలన్న ఉద్దేశం జెడ్పీ అధికారుల్లో కనిపించడం లేదు. పాలకవర్గాన్ని ధిక్కరించి సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారు. గతంలో పని చేసిన కొందరు జిల్లా స్థాయి అధికారుల కారణంగా ఇలా తయారయ్యారు. జిల్లా అభివృద్ధితో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి మా వంతు కృషి చేస్తున్నాం. అధికారుల నుంచే సహకారం లేదు.

– బోయ గిరిజమ్మ,
జెడ్పీ చైర్‌పర్సన్

అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి

- డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి
- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 416 వినతులు

అనంతపురం అర్బన్: ప్రజల నుంచి అందే అర్జీలు పెండింగ్‌లో ఉంచకూడదని డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి డీఆర్‌ఓతో పాటు డిప్యూటీ కలెక్టర్లు శిరీష, కరుణకుమారి, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ ఓబులమ్మ, డీపీఓ ప్రభాకర్‌రావు అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 416 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో డీఆర్‌ఓ సమీక్షించారు. ప్రతి సమస్యకు తప్పనిసరిగా పరిష్కారం చూపించాలని ఆదేశించారు.

వినతుల్లో కొన్ని...

- భూమికి ఎన్‌ఓసీ ఇవ్వాలని గుత్తి పట్టణం కాపు వీధికి చెందిన నాగేంద్ర విన్నవించారు. తన తండ్రి 1974లో ఆర్మీ ఉద్యోగం నుంచి విరమణ పొందారన్నారు. గుత్తి మండలం అనగానిదొడ్డి గ్రామంలో ప్రభుత్వం 5 ఎకరాల భూమిని ఇచ్చిందని, ఇందుకు ఎన్‌ఓసీ ఇవ్వాలని కోరారు.
- తాము ఏళ్లగా సాగుచేసుకుంటున్న భూమిని వేరొకరి పేరున అడంగల్‌లో నమోదు చేశారని గుత్తి మండలం రాచుపల్లికి చెందిన లక్ష్మీదేవి తెలిపారు. సర్వే నంబరు 337–ఏ5బీలో రెండు ఎకరాల భూమి 15 ఏళ్లగా తమ అనుభవంలో ఉందని, ఈ భూమిని అడంగల్‌లో వేరొకరి పేరు నమోదు చేశారని వాపోయారు. విచారణ చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు
- రిసోర్స్‌పర్సన్‌గా పనిచేస్తున్న తనను ఉద్యోగం నుంచి తొలగించారని కళ్యాణదుర్గం పట్టణం పార్వతినగర్‌కు చెందిన ఎస్.మునీశ్వరి ఫిర్యాదు చేశారు. కొందరు నాయకుల ప్రమేయంతో తొలగించారన్నారు. సమాఖ్యకు సంబంధించి పుస్తకాలు ఇవ్వాలంటూ భయపెడుతున్నారన్నారు. ఉద్యోగం మీదే ఆధారపడి జీవనం సాగిస్తున్న తనకు న్యాయం చేయాలని కోరారు.

చోరీ చేస్తారు.. అడ్డొస్తే లేపేస్తారు!

హర్యానా, రాజస్తాన్, ఢిల్లీ రాష్ట్రాల సరిహద్దులో ఉంటుందా ప్రాంతం. అక్కడ ఉండే మగవాళ్లంతా చోరీల్లో సిద్ధహస్తులే. ఏడాది పాటు దోపిడీలు చేసి ఆ డబ్బుతో తిరిగి స్వగ్రామానికి వెళ్లడం వారి ఆనవాయితీ. అలాంటి వారు జిల్లాపై కన్నేసినట్లు ప్రాథమికంగా తెలిసింది. జిల్లాలోని పలు ఏటీఎం కేంద్రాల్లో ఇటీవల జరిగిన వరుస చోరీ ఘటనల్లో వీరి హస్తం ఉన్నట్లు నిర్ధారణైంది.

- ఏటీఎం చోరీ కేసులను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు
- ప్రాథమికంగా సేకరించిన ఆధారాలు బట్టి 'మేవార్ గ్యాంగ్' అని నిర్ధారణ



అనంతపురంలో సోమవారం అర్ధరాత్రి పోలీసుల తనిఖీలు

అనంతపురం: జిల్లాలోని ఏటీఎంలలో జరిగిన వరుస చోరీ ఘటనలు కలకలం రేపాయి. గత శుక్రవారం గార్లదిన్నె మండల కేంద్రంలోని ఏటీఎంలో చోరీ జరిగింది. ఈ ఘటన మరువకనే ఆదివారం అనంతపురం నగరంలోని రామ్‌నగర్‌లో ఏటీఎంను కొల్లగొట్టడం చర్చనీయాంశమైంది. ప్రధాన కూడలిలో ఉండే ఏటీఎంలోకి చొరబడి ఏకంగా రూ.29 లక్షల నగదును చోరీ చేయడం సంచలనం రేపింది. ఈ క్రమంలో దుండగులను పట్టుకునేందుకు రంగంలోకి దిగిన పోలీసులకు హడలెత్తించే విషయాలు తెలిశాయి. ఘటన జరిగిన ప్రాంతాల్లో సేకరించిన కాల్ డేటాను బట్టి కరుడుగట్టిన మేవార్ గ్యాంగే ఏటీఎంలలో చోరీలకు పాల్పడినట్లు ప్రాథమికంగా తెలిసింది.

చోరీల్లో సిద్ధహస్తులు..

మేవార్ గ్యాంగ్ గురించి తెలుసుకునేందుకు ప్రయత్నించగా, పలు భయంకర విషయాలు వెల్లడయ్యాయి. హర్యానా, రాజస్తాన్, ఢిల్లీ రాష్ట్రాల సరిహద్దుల్లోని మేవార్ రీజన్‌కు చెందిన వీరు ఏటీఎంల చోరీల్లో సిద్ధహస్తులు. ఏడాదంతా చోరీలు చేసి ఒకసారి మాత్రమే ఇంటికి వెళ్తారు. మేవార్ ప్రాంతంలో మగవారెవరూ ఇంటి వద్ద ఉండరు. చోరీలు చేయడానికి వివిధ రాష్ట్రాలకు వెళ్తారు. అలా వెళ్లిన వారు.. దశల వారీగా మళ్లీ సొంతూళ్లకు వస్తారు. ఏక కాలంలో మూడు, నాలుగు చోరీలు చేయడానికి ప్రణాళిక రూపొందిస్తారు. చాకచక్యంగా చోరీలు చేస్తారు. సీసీ కెమెరాలకు నల్లని రంగు పూయడం, గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం పగులగొట్టడం, నగదు అపహరించడం వీరి పని. గ్యాంగ్‌లోని ఐదుగురిలో ముగ్గురు మాత్రమే చోరీలో పాల్గొంటారు. ఇద్దరు బయట కాపలా ఉంటారు. ఎవరైనా అడ్డు వస్తే అంతమొందించేందుకూ వెనుకాడరు.

ముమ్మరంగా తనిఖీలు

అనంతపురం: జిల్లాలో వరుసగా దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏటీఎం సెంటర్ల వద్ద భద్రతపై సోమవారం సమీక్ష చేశారు. ఎస్‌ఐలు, సీఐలే కాకుండా డీఎస్పీలు సైతం రంగంలోకి దిగి అర్ధరాత్రి వేళ తనిఖీలు చేపట్టారు. రాత్రి గస్తీలు పెంచారు. ఏటీఎం సెంటర్లు, బ్యాంకుల వద్ద భద్రత పటిష్టం చేశారు.

చెరువు.. గుండె బరువు!

వద్దన్నా సమృద్ధిగా కురిసిన వర్షాలతో గత ఐదేళ్లూ జలసిరిని సంతరించుకుని ప్రజలకు కనువిందు చేసిన 'అనంత సాగరం' చెరువు కళావిహీనంగా మారుతోంది. రోజురోజుకూ ఎండిపోతూ ఆశలను దూరం చేస్తోంది. నెర్రెలు చీలి, ఎండిన చెట్లతో ఎడారిని తలపిస్తోంది. పశుపక్ష్యాదులనూ కష్టాల్లోకి నెట్టేస్తోంది. వర్షాకాలమైనా చెరువులో నీరు తగ్గిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. భవిష్యత్తులో కరువు కబళిస్తుందా అనే సంకేతం ఇస్తోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



నెర్రెలు చీలిన అనంత సాగరం



టీవీ టవర్ సాక్షిగా నిర్జీవమై కనిపిస్తోందిలా..



ఆహారం కోసం ఎండిన చెట్లపై కాకుల నిరీక్షణ

క్లుప్తంగా

చౌడేశ్వరి ఆలయంలో చోరీ



ఆలయాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని మల్లిపల్లి గ్రామంలో వెలసిన చౌడేశ్వరి ఆలయంలో చోరీ జరిగింది. ఆదివారం అర్ధరాత్రి ఆలయంలోకి చొరబడిన దుండగులు 4 కిలోల వెండి ఆభరణాలు, హుండీని ఎత్తుకెళ్లారు. ఆరు బయలు నిర్మానుష్య ప్రాంతంలో హుండీని ధ్వంసం చేసి అందులోని రూ.6 వేల వరకూ నగదు అపహరించుకెళ్లారు. కాగా, ఆలయంలోకి ప్రవేశించిన వెంటనే దుండగులు సీసీ కెమెరాలను ధ్వంసం చేసినట్లుగా తెలుస్తోంది. సోమవారం ఉదయం ఆలయం తలుపులు తీసి ఉండడం గమనించిన స్థానికులు చోరీ జరిగినట్లుగా నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్ సీఐ చంద్రశేఖర్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. స్నిప్పర్‌డాగ్‌ను రంగంలో దించారు. క్లూస్‌టీం సాయంతో ఆధారాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జిల్లాకు నేడు విద్యాశాఖ ఆర్జేడీ రాక

అనంతపురం ఎడ్యుకేషన్: పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) శామ్యూల్ జిల్లాకు మంగళవారం రానున్నారు. ఈ క్రమంలో పంగల్‌రోడ్డు సమీపంలోని ఆర్డీటీ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ స్కూల్‌లో డీవైఈఓలు, ఎంఈఓ-1, 2లతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ఉంటుందని అందరూ తప్పకుండా హాజరుకావాలని డీఈఓ వరలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు.

నేటి నుంచి ఉండబండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు



వీరభద్రస్వామి మూలవిరాట్

విడపనకల్లు: మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన ఉండబండ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకూ జరుగనున్నాయి ఈ మేరకు ఆలయ ఈఓ రమేష్ బాబు సోమవారం తెలిపారు. 6న గజ వాహన సేవతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 7న శేష వాహన, 8న మయూర వాహన, 9న నంది వాహన సేవలు ఉంటాయి. 10వ తేదీ రథోత్సవం ఉంటుంది. ఉత్సవాలకు వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మూడు పూటలా అన్నదానం ఉంటుంది. ఈ అన్నదానం శ్రావణ మాసం ముగిసే వరకూ ఉంటుందని నిర్వాహకులు, ఆలయ అన్నదాన కమిటీ అధ్యక్షుడు దండిన శివానంద తెలిపారు.

పూడిక తీత.. నిధుల మేత

- వర్క్ ఆర్డర్ ఇవ్వకుండానే శర వేగంగా సాగుతున్న పనులు
- ఇష్టారాజ్యంగా పూడికతీత
- టీడీపీ కాంట్రాక్టర్‌కు భారీగా లబ్ధి చేకూర్చిన అధికారులు



గత నెలలో నడిమివంకలో చేపట్టిన పూడికతీత పనులు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే నగరపాలక సంస్థలో నిబంధనలకు అధికారులు పాతర వేశారు. అత్యవసరం పేరుతో నగరంలోని నడిమి వంక, మరువవంకలో చేపట్టిన పూడికతీత పనులు.. నిధుల దోపిడీకేననేది స్పష్టమవుతోంది. టెండర్, వర్క్ ఆర్డర్ లేకుండా పనులు చేపట్టడం ఇందుకు నిదర్శనం. అయితే ఈ పనులు చివరి దశకు చేరాయని అధికారులు చెబుతున్నారు.

నిబంధనలకు తిలోదకాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే పూడికతీత పనులు చేపట్టేలా చూడాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈ క్రమంలో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అప్పటి కమిషనర్ మేఘ స్వరూప్ సమావేశమై పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ పనులకు నిబంధన మేరకు టెండర్లు నిర్వహించాలి. అయితే ఇందుకు విరుద్ధంగా ఎమ్మెల్యే దగ్గుపాటికి సన్నిహితంగా ఉండే టీడీపీకి చెందిన ఓ కాంట్రాక్టర్‌కు గంపగుత్తగా పనులు అప్పగించారు. ఇదే కాంట్రాక్టర్‌కు అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ పనులూ కేటాయించారు. వాస్తవానికి రూ.లక్ష వ్యయం దాటిన ప్రతి అభివృద్ధి పనికీ టెండర్లు ఆహ్వానించాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. నిబంధనలు ఉల్లఘించి పనులు అప్పగించిన విషయంగా తాము ఇబ్బంది పడాల్సి వస్తుందని అధికారులు మొరపెట్టుకోవడంతో గత నెల 11న పూడికతీత పనులకు టెండర్లు ఆహ్వానించారు. ఈ టెండర్‌నూ అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్ (సింగిల్ టెండర్) దక్కించుకోవడం గమనార్హం.

రూ.30 లక్షల పనులకు బిల్లులు

నగరంలోని నడిమివంకకు సంబంధించి 41, 42, 43, 47 డివిజన్లలో రూ.6.80 లక్షలు, 48వ డివిజన్ పరిధిలో రూ.6.30 లక్షలు, 39, 40 డివిజన్ల పరిధిలో రూ.4 లక్షలు, మరువవంకకు సంబంధించి 11 నుంచి 20 డివిజన్ల పరిధిలో రూ.5 లక్షలతో పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించారు. వీటితో పాటు ఎలాంటి టెండర్ లేకుండా నడిమి వంకకు సంబంధించి సాయినగర్‌లో పూడికతీత పనులు పూర్తి చేశారు. నగరపాలక సంస్థలోని ఓ డీఈ కనుసన్నల్లోనే ఈ పనులు జరగడం గమనార్హం. ఈ పనులకు రూ.10 లక్షలకు పైగా బిల్లు చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. అలాగే పాత త్రివేణి థియేటర్ నుంచి రాజహంస అపార్ట్‌మెంట్ వరకూ పూడికతీత పనులకు రూ.2.5 లక్షలు చేసినట్లు తెలుస్తోంది. ఇలా మొత్తం రూ.30 లక్షలకు పైగా చేపట్టిన పూడికతీత పనుల్లో భారీగా అవినీతి చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపడితే వాటికి ఎలాంటి బిల్లులూ చేయకూడదు. ఒకవేళ బిల్లు చేసినట్లుగా తెలిస్తే విజిలెన్స్ అధికారులు సుమోటోగా కేసు ఫైల్ చేసే అధికారం లేకపోలేదు. 2014 నుంచి 2019 అప్పటి టీడీపీ హయాంలోనూ విద్యుత్‌నగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా సీసీ రోడ్డును ఏర్పాటు చేశారు. అప్పట్లో సంబంధిత అధికారులపై ఉన్నతాధికారులు చర్యలకు ఆదేశించారు.

తూతూమంత్రంగా పనులు

పూడికతీత పనులు పక్కాగా చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయితే పూడికతీత పనులు తూతూమంత్రంగా సాగుతున్నాయి. వంకల్లోకి జేసీబీలు వెళ్లకుండా రోడ్డుపై నుంచే పూడికతీసి, వ్యర్థాలను అక్కడే వదిలేసి వెళ్తున్నారు. అంతేకాక పూడికను సదరు కాంట్రాక్టర్ కంపోస్టుకు తరలించాల్సి ఉంది. కానీ ఆ పరిస్థితి కనిపించడం లేదు.



పూర్తి స్థాయిలో పూడిక తొలగించకుండా వదిలేసిన దృశ్యం

వర్క్ ఆర్డర్ ఇవ్వాల్సి ఉంది

"గత నెలలో టెండర్లను ఆహ్వానించాం. కమిషనర్ బదిలీ కావడంతో వర్క్ ఆర్డర్ ఇవ్వలేకపోయాం. అయితే యుద్ధప్రాతిపదికన పూడికతీత పనులు చేపట్టాల్సి వచ్చింది. నగరంలోని నడిమివంక, మరువవంకలో ఇంకా పనులు చేయాల్సి ఉంది."

– సూర్యనారాయణ, ఈఈ, నగరపాలక సంస్థ

'హర్ ఘర్ తిరంగా'ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 15న హర్ ఘర్ తిరంగా అభియాన్ అనే పేరుతో ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు. ఈ నెల 11, 12, 13 తేదీల్లో తిరంగా యాత్ర పేరుతో బైక్ ర్యాలీలు, స్వాతంత్య్ర సమర యోధుల విగ్రహాలు శుభ్రం చేసి పూలమాలలు వేసి నివాళులివ్వడం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 14న విభజన విభీషక సంస్కరణ దివాస్ సందర్భంగా హాల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ నేతలు లలిత్ కుమార్, అశోక్ రెడ్డి, గొంది అశోక్, ఈశ్వర్, ఇలియాజ్, రంజిత్ నాయక్, శివ, రవికుమార్, చిరంజీవి, తేజ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర మోసగాళ్ల అరెస్ట్

తాడిపత్రి రూరల్: బంగారు నగలకు మెరుగు పడతామంటూ మోసం చేసిన కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు తాడిపత్రి రూరల్ అప్‌గ్రేడ్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిహార్‌లోని రూపాలి తాలాకాకు చెందిన ఛోటు కుమార్, పవన్ కుమార్ సోమవారం ఉదయం బంగారు నగలకు మెరుగు పడతామంటూ తాడిపత్రి మండలం కావేటి సముద్రం గ్రామంలో సంచరించారు. వీరి మాటలు నమ్మి స్థానిక రైతు బెడదల రఘునాథరెడ్డి సోదరి పుష్పలత కొన్ని నగలను వారికి ఇచ్చింది. మెరుగు పెట్టిన తర్వాత నగల బరువులో వ్యత్యాసం రావడంతో అనుమానం వచ్చిన రఘునాథరెడ్డి కుటుంబసభ్యులు వెంటనే వారిని నిర్బంధించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని ఆరా తీశారు. కెమికల్ సాయంతో నగలు కొంత మేర కరిగించి తీసినట్లు నిర్ధారణ కావడంతో నిందితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారణలో పుంగనూరు మండలం రామాపురం, కళ్యాణదుర్గంలోనూ మోసాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చినట్లుగా గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రూ.3.50 లక్షల అపహరణ



బాధిత రైతు వేణుప్రసాద్

ఉరవకొండ: పట్టపగలే ఉరవకొండలో చోరీ జరిగింది. ద్విచక్రవాహనంలో ఉంచిన రూ.లక్షల నగదు దుండగులు అపహరించుకెళ్లారు. వివరాలు... విడపనకల్లు మండలం ఉండబండ గ్రామానికి చెందిన రైతు వేణుప్రసాద్ ఇటీవల మిర్చి పంటను విక్రయించాడు. ఇందుకు సంబంధించిన రూ.3.50 లక్షల నగదు ఉరవకొండలోని ఎస్‌బీఐ శాఖలోని తన ఖాతాలో జమ కావడంతో సోమవారం ఉదయం బ్యాంక్‌కు చేరుకుని నగదు విత్‌డ్రా చేశాడు. అనంతరం నగదును తన ద్విచక్ర వాహనంలోని సైడ్ బ్యాగ్‌లో ఉంచుకుని స్వగ్రామానికి బయలుదేరిన ఆయన గవిమఠం ఆవరణలో ఉన్న బీరువాల తయారీ షాపు వద్ద వాహనం నిలిపి కొత్త బీరువా ఆర్డర్ ఇచ్చి వచ్చేలోపు వాహనంలోని రూ.3.50 లక్షలను దుండగులు అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ చుట్టుపక్కల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

విజయ డెయిరీ ద్వారా పాడి రైతులను ఆదుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్



అనంతపురం అర్బన్: పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వ విజయ డెయిరీ ద్వారా పాల సేకరణకు చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల నుంచి పాల సేకరణకు అమూల్ సంస్థతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసుకోవడంతో పాడి రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ఈ రకమైన నిర్ణయం తీసుకోవడం సరికాదని విమర్శించారు. జిల్లాలో అమూల్ సంస్థ సేకరించిన పాలల్లో రోజూ దాదాపు 60 వేల లీటర్లు రాయలసీమ జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకే సరఫరా అవుతున్నాయని గుర్తు చేశారు. ఇలాంటి తరుణంలో అమూల్ సంస్థతో ఒప్పందం రద్దు చేసుకోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు కర్ణాటక నుంచి పాలను దిగుమతి చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లుగా తెలుస్తోందన్నారు. ఈ నిర్ణయం జిల్లాలోని పాడి రైతులకు తీరని నష్టాన్ని కలగజేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పశువుల ధరలతో పాటు దాణా, గడ్డి, వాటికి వైద్యం ఖర్చులు పెరిగి పాడి రైతులు నష్టాల్లో ఉన్నారన్నారు. ఇప్పుడు అమూల్ డెయిరీ ద్వారా సేకరించడాన్ని అర్ధంతరంగా నిలిపివేస్తే మరింత నష్టపోతారన్నారు. ఇలాంటి తరుణంలో విజయ డెయిరీ ద్వారా పాల సేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

బాధ్యత మరిచిన అయ్యవార్లు



ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కళ్యాణదుర్గం: రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన ఇద్దరు ఉపాధ్యాయులు గాడితప్పారు. నేతలను ప్రసన్నం చేసుకునేందుకు తమ నైతికతకు పాతర వేశారు. వివరాలు... కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ సోమవారం కళ్యాణదుర్గంలో ఉపాధ్యాయులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్త సంస్కృతికి తెరతీస్తూ కుందుర్పి మండలం కరిగానిపల్లిలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడు సంగప్ప, బెళుగుప్ప మండలం నరసాపురం గ్రామ జెడ్పీహెచ్ఎస్‌లో ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బీపీ మారుతి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గమనించిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులే రాజకీయాలు ఒంటబట్టించుకుంటూ నేతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. విద్యారంగంలో ఇలాంటి పోకడలకు తావులేదని, ఉన్నత సమాజ నిర్దేశకులుగా ఉండాల్సిన ఉపాధ్యాయుల తీరు ఇది కాదని పేర్కొన్నారు. తక్షణమే ఈ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుని విద్యారంగ ప్రతిష్టకు భంగం కలగకుండా చూడాలని కోరుతున్నారు.

ప్రతి రైతుకూ రూ.20 వేలు వెంటనే ఇవ్వాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న రామకృష్ణ

అనంతపురం అర్బన్/రాప్తాడురూరల్: రాయలసీమ జిల్లాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతుకూ పెట్టుబడి సాయం కింద రూ.20 వేలను తక్షణమే అందించాలని కూటమి ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం అనంతపురం జిల్లా సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాలు కురవని కారణంగా రాయలసీమ జిల్లాల్లో 30 శాతం కూడా విత్తనం పడలేదన్నారు. ఇప్పటికే సాగు చేసిన పత్తి, మిరప, వేరుశనగ, కంది పంటలు వర్షాభావం కారణంగా ఎండిపోయాయన్నారు. రైతులు పెట్టుబడులు పూర్తిగా నష్టపోయారన్నారు. ఈ పరిస్థితుల్లో రైతుకు ప్రభుత్వ సాయం అవసరమన్నారు. అలాగే రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు, ఎరువులను ఉచితంగా ఇవ్వాలని కోరారు. అంతకు ముందు ఆయన అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామంలో కంది పంట పరిశీలించి, మాట్లాడారు. తుంగభద్ర డ్యామ్, శ్రీశైలం డ్యాంలో నీరు పుష్కలంగా ఉండడంతో హంద్రీ-నీవా కెనాల్, పీఏబీఆర్ కెనాల్‌కు పూర్తిస్థాయిలో నీటినందించి చెరువులు నింపాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్, ఏపీ రైతు సంఘం గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సహాయ కార్యదర్శులు పి.నారాయణస్వామి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజారెడ్డి, రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి పి. రామకృష్ణ పాల్గొన్నారు.

ఆంధ్రా ఘన విజయం



ఏపీ జట్టు క్రీడాకారులు

అనంతపురం: బిహార్‌పై ఆంధ్రా జట్టు ఘనవిజయం సాధించింది. జూనియర్ గర్ల్స్‌జాతీయ స్థాయి ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా సోమవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో బిహార్- ఆంధ్రప్రదేశ్ జట్ల మధ్య జరిగింది. ఆంధ్రప్రదేశ్ జట్టు మూడు గోల్స్ సాధించగా, బిహార్ జట్టు ఒక గోల్ కూడా సాధించక చతికిలపడింది. ఆంధ్రా క్రీడాకారిణులు సాయి వర్షిత, వి. నందిని, టి. అరుణ ఒక్కో గోల్ చొప్పున సాధించారు.

- మధ్యాహ్నం జార్ఖండ్- హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల మధ్య జరిగిన మ్యాచ్‌లో జార్ఖండ్ విజయకేతనం ఎగురవేసింది. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో జార్ఖండ్ జట్టు 25 గోల్స్ చేయగా, హిమాచల్ ఒక గోల్ కూడా చేయక ఘోర పరాజయం మూటకట్టుకుంది. కార్యక్రమంలో డీఎస్‌డీఓ రాష్ట్ర గ్రాస్‌రూట్ కన్వీనర్ బి. సుధాకర్, రుద్ర (ఏపీ హోటల్‌మేనేజ్‌మెంట్ టీజర్), రావూరి రాజేష్ (ఏపీఎఫ్ఏ, డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్), ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డి. మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

అనంతపురం రూరల్: డీఎస్సీ ఉచిత శిక్షణకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజినేయులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 3 నెలల పాటు శిక్షణ ఇవ్వడంతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం జిల్లా గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

దివ్యాంగుడి బలవన్మరణం



రాము (ఫైల్)

గుత్తి రూరల్: మండలంలోని తురకపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు మేడా రాము(43) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... తన భార్య రాధతో కలసి గ్రామంలోని పాఠశాల వద్ద చిల్లర దుకాణం ఏర్పాటు చేసుకుని రాము జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం రాము కాళ్లకు శస్త్ర చికిత్స జరిగింది. అప్పటి నుంచి రెండు కాళ్లు బలహీనంగా మారి దివ్యాంగుడయ్యాడు. అప్పటి నుంచి పనులు చేసుకోలేక ఇబ్బంది పడుతున్న ఆయన మానసికంగా కుంగిపోయాడు. ప్రతి చిన్న పనికి ఇంట్లో భార్యాపిల్లలపై ఆధారపడాల్సి వచ్చింది. తన పరిస్థితి ఇంతగా దిగజారడంతో తన ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు ఎలా చేయాలో తెలియడం లేదంటూ తెలిసిన వారితో చెప్పుకుని చాలా బాధపడేవాడు. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన సోమవారం ఉదయం తన భార్యను దుకాణంలో ఉంచి భోజనం చేసి వస్తానంటూ ఇంటికి వెళ్లి పైకప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి చేరుకున్న భార్యాపిల్లలు... ఉరికి విగతజీవిగా వేలాడుతున్న రామును చూసి బిగ్గరగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని రాముని కిందకు దించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆత్మహత్యకు ముందు రాము రాసి పెట్టిన ఉత్తరాన్ని స్వాధీనం చేసుకున్నారు. తన రెండు కాళ్లు బలహీనంగా మారడంతో ప్రతి పనికీ ఇతరులపై ఆధారపడాల్సి వస్తోందని, దీంతో జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా అందులో రాసి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'పోలీసు స్పందన'కు 133 వినతులు

అనంతపురం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 113 వినతులు అందాయి. అడిషనల్ ఎస్పీలు ఆర్.విజయభాస్కర్ రెడ్డి, జి.రామకృష్ణ, అనంతపురం అర్బన్ డీఎస్పీ టీవీవీ ప్రతాప్ నేరుగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటామని భరోసానిచ్చారు.

ఊసరవెల్లి.. ఆసక్తిగా చూశారు మళ్లీ మళ్లీ



ఉన్నపళంగా రోడ్డుకు అడ్డంగా ఊసరవెల్లి రావడంతో వాహన చోదకులు ఎంతో ఆసక్తిగా చూడసాగారు. కూడేరు మండలం జల్లిపల్లి వద్ద సోమవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. రంగులు మారుస్తూ జాతీయ రహదారిపై నెమ్మదిగా నడుచుకుంటూ పచ్చిక బయలు సమీపిస్తున్న కొద్ది ఆకుపచ్చ రంగుకు మారుతూ వెళుతుంటే పలువురు తమ సెల్‌ఫోన్లలో బంధించేందుకు పోటీ పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

పాముకాటుతో ఇద్దరి మృతి

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో పాము కాటుతో ఇద్దరు మృతి చెందారు. వివరాలు...



మృతులు గంగమ్మ, అనిల్ (ఫైల్)

ఆత్మకూరు: మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన గంగమ్మ (58) పాము కాటుతో మృతి చెందింది. కూలి పనులతో జీవనం సాగిస్తున్న ఆమె సోమవారం ఉదయం వేరుశనగ పొలంలో పని చేస్తున్న సమయంలో పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న తోటి కూలీలు ఆమెను వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, గంగమ్మ భర్త ఏడేళ్ల క్రితమే మరణించాడు. ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరికి పెళ్లిళ్లు కావడంతో గంగమ్మ పొలం పనులతో జీవనం సాగిస్తుండేది.

నిద్రిస్తుండగా పాము కాటు...

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని కాపర్లపల్లికి చెందిన అనిల్ (30) జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం రాత్రి ఇంటి బయట నిద్రిస్తున్న ఆయన అర్ధరాత్రి సమయంలో కుటుంబసభ్యులను నిద్రలేపి తనకు ఏదో కుట్టినట్లుగా ఉందని తెలిపాడు. దీంతో కుటుంబసభ్యులు పరుపులు విదిలించి చూశారు. ఆ సమయంలో ఓ కట్ల పాము పరుపుల కింద నుంచి వేగంగా చీకట్లోకి వెళ్లిపోయింది. దీంతో బాధితుడిని వెంటనే నాటు వైద్యుని వద్దకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనంతరం పీహెచ్‌సీకి తరలించారు. చికిత్సకు స్పందించిక ఆయన మృతి చెందాడు. కాగా, అనిల్‌కు భార్య గాయత్రి, ఇద్దరు కుమార్తెలు, రెండేళ్ల వయసున్న కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నీటి హక్కులను కాపాడండి

- ఏపీ రైతు సంఘం డిమాండ్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: కృష్ణా నదీ జలాల పునఃపంపణీ ద్వారా రాష్ట్ర నీటి హక్కులను కాపాడాలంటూ ప్రభుత్వాన్ని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. డిమాండ్ సాధనలో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున మాట్లాడుతూ... రాష్ట్ర విభజన చట్టం 2014, గత ట్రిబ్యునల్ తుది ఉత్తర్వులకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న, నిర్మించాలని తలపెట్టిన పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం- ఫేజ్2 తదితర ప్రాజెక్టుల వల్ల దిగువన ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు చేకూరే నష్టాన్ని వివరిస్తూ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు నివేదిక అందజేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. అలాగే శ్రీశైలం ప్రాజెక్ట్ దిగువన నాగార్జున సాగర్ ఎడమ కాలువ నుంచి తెలంగాణ 99 టీఎంసీల నీటిని, ఆంధ్రప్రదేశ్ 33 టీఎంసీల నీటిని వినియోగించుకోవాల్సి ఉందన్నారు. అయితే ఏపీ కోటా మేరకు నీరు ఏ సంవత్సరమూ అందలేదని గుర్తు చేశారు. కృష్ణా-గోదావరి నదులకు చివరన ఏపీ ఉండడంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా... వరదలు సంభవించినా నష్టపోయేది ఈ ప్రాంత రైతులేనని అన్నారు. ఈ క్రమంలో నీటి హక్కులను కాపాడుకునేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్ఓ రామకృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, నారాయణస్వామి, బండిరామకృష్ణ, నరప రామకృష్ణ, రామాంజినేయులు, నాగేష్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి



వంశీకృష్ణ (ఫైల్)

గుంతకల్లు: సెల్‌ఫోన్ మాయాజాలంలో చిక్కుకున్న ఓ యువకుడు రైలు ఢీకొని మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని సత్యనారాయణపేట రైల్వే మోరీ సమీపంలో నివాసముంటున్న బాలన్న, గీత దంపతుల కుమారుడు వంశీకృష్ణ (28) బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇటీవల గుంతకల్లుకు వచ్చిన ఆయన సోమవారం ఉదయం ఇంటి సమీపంలోని పట్టాల వద్దకు బహిర్భూమికని వెళ్లాడు. అనంతరం హెడ్‌ఫోన్స్ పెట్టుకుని సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ రైలు వస్తున్న విషయం గుర్తించకుండా పట్టాలు దాటే ప్రయత్నం చేశాడు. అప్పటికే అత్యంత సమీపంలోకి వచ్చిన రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

సీఎం కాన్ఫరెన్స్‌లో కలెక్టర్



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: రాష్ట్ర సచివాలయం ఐదవ భవనంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్ పాల్గొన్నారు. జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన పనులు అందుకు అవసరమైన నిధులపై అంచనాలతో కూడిన సమగ్ర నివేదికను ఈ సందర్భంగా ప్రభుత్వానికి కలెక్టర్ సమర్పించారు.

8న నాగుల నగరోత్సవం

అనంతపురం కల్చరల్: ఆధ్యాత్మిక రచయిత కరణం వెంకటప్రసాద్ నేతృత్వంలో గురువారం నాగుల చవితి వేడుకల సందర్భంగా ప్రత్యేక హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటూ నాగుల నగరోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి అనంత్ నాగ్ స్వర్గ్ కల్చరల్ అసోసియేషన్ వారిచే స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయం వేదికగా ప్రాచీన కళారూపాల ప్రదర్శన, సంగీత, నాట్య ఉత్సవం జరుగుతుందని వెల్లడించారు.

పాడి రైతులను ఆదుకోండి



తహసీల్దార్ విజయకుమారికి వినతిపత్రం ఇస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

రాప్తాడు: అమూల్ పాల సేకరణ రద్దు చేస్తే పాల వెల్లువ కార్యక్రమం కింద ఆ సంస్థకు పాలను అందిస్తున్న పాడి రైతులు నష్టపోకుండా ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ విజయకుమారికి వినతిపత్రం అందజేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో జిల్లాలో పాడి రైతులను ఆదుకునేందుకు డ్వాక్రా సంఘాల ద్వారా అమూల్ పాల డెయిరీ ఏర్పాటు చేసి దాదాపుగా జిల్లాలో 100 పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ నెల 11 నుంచి అమూల్ డెయిరీ యజమాన్యం నుంచి పాలు కొనుగోలు చేయమని ఏజెంట్లు, పాడి రైతులకు మెసేజులు పెడుతుండడంతో వేలాది మంది పేద పాడి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, యూనివర్సిటీలు, ప్రభుత్వ హస్టల్స్‌కు పాలు సరఫరా చేసి పాడి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు పోతులయ్య, చంద్రశేఖర్ రెడ్డి, సుబ్బి రెడ్డి పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి సుజికి స్కూటర్లు



స్కూటర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: కస్టమర్లను ఆకర్షించే విధంగా సుజికి కంపెనీ సరికొత్త రంగుల్లో ద్విచక్ర వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. సోమవారం నగరంలోని అమృత్ సుజికీ షోరూంలో సుజికి యాక్సెస్, అవెనిస్, బర్గ్‌మేన్ స్కూటర్లను షోరూం ఎండీ రుకేష్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్ క్రాంతికుమార్ పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు



వెల్ఫేర్ కార్యదర్శికి నియామక పత్రం అందిస్తున్న మునిసిపల్ ఆర్‌డీ మూర్తి

అనంతపురం కార్పొరేషన్: అంకితభావంతో చేసి, మీరు విధులు నిర్వర్తించే మునిసిపాలిటీ, నగరపాలక సంస్థకు మంచి పేరు తీసుకురావాలని మునిసిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి పేర్కొన్నారు. సోమవారం మునిసిపల్ ఆర్‌డీ కార్యాలయంలో 9 మందికి వెల్ఫేర్ కార్యదర్శులకు నియామక పత్రాలు అందజేశారు. గతంలో బీకాం విద్యార్హత కల్గిన వారు వెల్ఫేర్ కార్యదర్శులుగా తమకు అవకాశం కల్పించాలని కోర్టును ఆశ్రయించారు. కోర్టు, ప్రభుత్వం నుంచి వెల్ఫేర్ కార్యదర్శుల నియామకానికి గ్రీన్ సిగ్నల్ రావడంతో, 12 మంది అభ్యర్థుల్లో హాజరైన 9 మందికి నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, ఆర్‌ఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల స్వీకరణ

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 7 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు కమిషనర్ శ్రీహరిబాబు ప్రజల సమస్యలను తెలుసుకుని సకాలంలో వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏసీపీ మారుతీహరిప్రసాద్, ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి, ఈఈ సుధారాణి, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

అసౌకర్యాల వసతి



రామ్‌నగర్‌లోని హాస్టల్‌లో ధ్వంసమైన కిటికీ అద్దాలు

- జీసీ వసతి గృహంలో సమస్యలు కోకొల్లలు
- విద్యార్థుల అవస్థలను పట్టించుకోని అధికారులు
- కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్నా పర్యవేక్షణ శూన్యం



భోజనం రుచిగా లేకపోవడంతో బయట పడేసిన దృశ్యం

అనంతపురం రూరల్: పేద విద్యార్థులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. బీసీ సంక్షేమశాఖ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు సమస్యలతో సతమవుతున్నారు. తాగడానికి నీరు, ఉండటానికి సరిపడ గదులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం రామ్‌నగర్ సమీపంలో బీసీ సంక్షేమశాఖ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న కళాశాల వసతి గృహంలో దాదాపు 160 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. విద్యార్థులకు సరిపడ గదులు, మరుగుదొడ్లు లేవు. ఒక్కో గదిలో దాదాపు 15 నుంచి 20 మంది వరకూ ఉండాల్సిన దుస్థితి నెలకొంది. కొంతమంది గదుల్లో ఉంటే మరి కొంతమంది విద్యార్థులు బయట ఉండాల్సిన పరిస్థితి దాపురించింది. సరిపడ మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి బయటికి పరిగెత్తాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వసతి గృహాల్లో సమస్యలు వెక్కిరిస్తున్నాయి. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

■ విద్యకు మాజీ సీఎం వైఎస్ జగన్ పెద్దపీట

గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేశారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే వసతి గృహాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించారు. దీంతో వసతి గృహాల్లో వసతి పొందుతూ చదువుకుంటున్న విద్యార్థుల చదువులు సాఫీగా సాగాయి.

■ నెలకు రూ.42 వేల అద్దె

వసతి గృహానికి నెలకు రూ.42 వేలు ప్రభుత్వం అద్దె చెల్లిస్తున్నప్పటికీ సరైన వసతులు మాత్రం లేవు. గదులకు తలుపులు కిటీకీలు కూడా లేవు. దోమల బెడదతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు అయితే చాలు జాగారం చేయాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థులు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి ప్రతి నెలా అద్దె చెల్లిస్తున్నప్పటికీ భవన యాజమాని నుంచి మరమ్మతులు చేయించుకోవాల్సిన బాధ్యత వార్డెన్లపై ఉంది. అయితే వార్డెన్లు ఇవేమీ పట్టించుకోవడం లేదు.

■ పర్యవేక్షణ శూన్యం

వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు విద్యార్థులకు మోనూ ప్రకారం భోజనం అందేలా చూడాల్సిన బాధ్యత బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్, సహాయ సంక్షేమ అధికారులపై ఉంది. అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీసీ సంక్షేమశాఖ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న వసతి గృహంలో నెలకొన్న సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక మిగిలిన వసతి గృహాల పర్యవేక్షణ ఏ విధంగా చేస్తారో అర్థం చేసుకోవచ్చు.

160 మందికి ఒక్కరే వర్కర్

160 మంది విద్యార్థులు ఉన్న వసతి గృహంలో 3 నుంచి 4 మంది వర్కర్లు పని చేయాల్సి ఉంది. అయితే ఇక్కడ మాత్రం ఒక్క వర్కర్‌తోనే అన్ని పనులు చేయిస్తున్నారు. వర్కర్ ఒక్కరే ఉండటంతో భోజనం కూడా సరిగా చేయలేని పరిస్థితి నెలకొంది. ఉడికీ ఉడకని అన్నం, రుచిలేని కూరలు చేస్తుండటంతో విద్యార్థులు భోజనం సరిగా తినలేక బయట పడేస్తున్నారు. వర్కర్ ఒక్కరే అన్ని పనులు చేయలేక పోతుండటంతో విద్యార్థులతో వంట పనితో పాటు వివిధ పనులు చేయిస్తున్నారు.

'ఎస్సీ వర్గీకరణపై మాయావతి బుద్ధి మారాలి'

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ వర్గీకరణపై మాయావతి బుద్ధి మారాలని ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ అన్నారు. సోమవారం స్థానిక ఎంఈఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే ఎస్సీ జాబితాలో అన్ని ఉప కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రతి ఉప కులానికి జనాభా ప్రాతిపదికన సమాన వాటా దక్కుతుందనే సామాజిక న్యాయసూత్రాన్ని మాయావతి విస్మరిస్తున్నారన్నారు. భారత రాజ్యాంగంలోని 341వ ఆర్టికల్ ఎస్సీ రిజర్వేషన్లకు అడ్డంకి లేదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. దేశంలో దళితులకు పెద్దదిక్కుగా ఉండాల్సిన మాయావతి సాటి దళితులకు నోట్లో మట్టి కొటేలా మాట్లాడటం దురదృష్టకరమన్నారు. ఎస్సీ రిజర్వేషన్లపై కోర్టుకు వెళ్లితే పిటిషన్ తిరస్కరణకు గురికాక తప్పదన్నారు. ఇప్పటికైనా మాయావతి ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాగేంద్ర, దేవర పుల్లన్న, శ్రీనివాసులు, ప్రసాద్, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రవేశ పరీక్షలు రద్దు చేయాలి



స్టూడెంట్స్ మార్చ్‌లో పాల్గొన్న విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి ప్రవేశ పరీక్షలను రద్దు చేయాలని ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో 'స్టూడెంట్స్ మార్చ్' నిర్వహించారు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల నుంచి ప్రారంభమై మార్చ్ ఆర్ట్స్ కళాశాల వరకూ సాగింది. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఐసా రాష్ట్ర అధ్యక్షుడు వేమన, మానవ హక్కుల వేదిక రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ మాట్లాడారు. దేశంలో ఎన్టీఏ నిర్వహిస్తున్న పరీక్షల్లో పేపర్ లీకులు, పరీక్షల రద్దు సర్వసాధారణంగా మారాయన్నారు. ఇలా పోతే రానున్న రోజుల్లో ఆదాని, అంబానీ పాలిట దేశ భవిష్యత్తు ఉండేలా కనిపిస్తోందన్నారు. ఎన్టీఏలో ఇన్ని అవకతవకలు జరుగుతున్నా ప్రధాని మోదీ చర్యలు తీసుకోవడం లేదన్నారు. కోచింగ్ సెంటర్ల పేర్లతో కార్పొరేట్ కోచింగ్ మాఫియా లక్షలాది మంది విద్యార్థుల నుంచి కోట్లాది రూపాయలను సొమ్ము చేసుకుంటోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు టీఎస్ వలి, సి.పరశురాముడు, సుజాతమ్మ ఐసా జిల్లా అధ్యక్షుడు శివకుమార్, బాలకృష్ణ, రాజు నాయక్, హేమంత్ కుమార్ , మహేష్ , వెంకట రమణ పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించం

అనంతపురం కార్పొరేషన్: సచివాలయ పారిశుధ్య, అమినిటీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి. ఉదయం 8 గంటలకే వివిధ వార్డుల్లో పర్యటిస్తే సమస్యలు తెలుస్తాయని అదనపు కమిషనర్ శ్రీహరిబాబు పేర్కొన్నారు. కమిషనర్ పీవీవీఎస్ మూర్తి ఆదేశాల మేరకు సోమవారం ఆయన నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ప్రధానంగా చెత్తను కంపోస్టుకు తరలించడం, చెత్త సేకరణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

నేనెందుకు సంతకం చేస్తా?

- మీరు తప్పులు చేస్తే కప్పిపుచ్చాలా?
- రీజాయిండరీపై సంతకం చేసేందుకు ససేమిరా అంటున్న ఏపీసీ
- తలలు పట్టుకుంటున్న సమగ్ర శిక్ష సిబ్బంది
- మూడు రోజులుగా ఫైలు పెండింగ్

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష కార్యాలయంలో పని చేస్తున్న సెక్టోరియల్ అధికారులను నిబంధనలకు విరుద్ధంగా రిలీవ్ చేయడం, డీఈఓ పరిధిలో ఉండే సీనియర్ అసిస్టెంట్ల రిలీవింగ్ అంశాన్ని కలెక్టర్‌కు ఫైలు పెట్టి చేయించడంపై 'సాక్షి'లో 'అస్మదీయుల కోసం అడ్డగోలు నిర్ణయం', 'సమగ్ర శిక్షలో కలకలం' కథనాలు ప్రచురితమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ ఉద్యోగులతో పాటు, ఉపాధ్యాయుల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. నిబంధనలకు విరుద్ధంగా రిలీవ్ చేయడం, కలెక్టర్‌ను తప్పుదారి పట్టించేలా ఫైలు పెట్టడం, అదికూడా తప్పులతడకగా పెట్టారంటూ ఆధారాలతో సహా ప్రచురించడంతో విద్యాశాఖ అధికారుల గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లు తయారైంది. ఇటు కలెక్టర్, అటు విద్యాశాఖ కమిషనర్‌కు సమాధానం వివరణ ఇచ్చుకునేందుకు తంటాలు పడ్డారు. ఓ సీనియర్ అసిస్టెంట్ నిర్వాకం, అస్మదీయులకు అందలం ఎక్కించాలనే ఓ అధికారి తీసుకున్న నిర్ణయాలు తప్పిదాలకు అవకాశం కల్పించాయి.

రీజాయిండరీ తయారీ..

'సాక్షి'లో వచ్చిన కథనాలపై కప్పిపుచ్చుకునేందుకు ఎట్టకేలకు సమగ్రశిక్ష ఉద్యోగులతో రీజాయిండరీ తయారు చేయించారు. కలెక్టర్ అనుమతితో 'సాక్షి'కి పంపుతామని చెప్పారు. అయితే రీజాయిండరీపై సంతకం చేసేందుకు ప్రస్తుతం ఏపీసీగా బాధ్యతలు తీసుకున్న నాగరాజు ససేమిరా అన్నారు. సంబంధిత సూపరింటెండెంట్ వెళ్లి ఏపీసీని కలువగా ఆయన తీవ్రస్థాయిలో స్పందించినట్లు తెలిసింది. రీజాయిండరీపై నేనెందుకు సంతకం చేస్తా.. నాకు ఏమి సంబంధం.. నీకు ఎవరైతే చెప్పారో వారితోనే చేయించుకోపో' అని ఘాటుగా చెప్పినట్లు సమాచారం. ఫైలంతా తప్పులతడకగా రాయడంతోనే ఆయన రీజాయిండరీపై సంతకం చేసేందుకు ససేమిరా అన్నట్లు తెలిసింది. దీనిపై సమగ్ర శిక్ష సూపరింటెండెంట్ ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ.. రీజాయిండరీ తయారు చేశామని అధికారులు సంతకం చేయకపోవడంతో పెండింగ్‌లో ఉందని చెప్పారు.

117 జీఓ రద్దు చేయాలి



రాప్తాడులో నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు

రాప్తాడు: జీఓ 117 ఆధారంగా పని సర్దుబాటు చేయడంతో ఉపాధ్యాయుల తీవ్రంగా నష్టపోతున్నారు. వెంటనే పని సర్దుబాటు నిలిపివేసి, నెలవారి పదోన్నతులు కల్పించాలని ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యా రంగానికి నష్టం కలిగించే జీఓ 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. పది మందిలోపు విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలను మూసివేయాలని విద్యాశాఖ అధికారులు వెబ్ఎక్స్ సమావేశంలో చెబుతున్నారని తెలిపారు. దీంతో పేద విద్యార్థులు విద్యకు దూరం అవుతారన్నారు. పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని ఏపీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటును గతంలో మండల, జిల్లా స్థాయిలో స్థానికంగా అవసరాన్ని బట్టి చేసేవారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో ఆన్‌లైన్ విధానంలో చేస్తామనడం గందరగోళానికి దారితీస్తుందన్నారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. విద్యాశాఖకు సంబంధించిన నిర్ణయాలు తీసుకునే ముందు ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు ఓబులేష్, ఆంజనేయులు, కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల సర్దుబాటు ప్రక్రియకు ముందే 117 జీఓ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆప్టా జిల్లా అధ్యక్షుడు సి.గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.వెంకటరత్నం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ఉపాధ్యాయుల వివరాలను ఫేషియల్ రికగ్నేషన్ యాప్, టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో పొందుపరచాలని కోరడం ఉపాధ్యాయుల సర్దుబాటు కోసమే అని భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాలతో ప్రత్యక్షంగా సమావేశం ఏర్పాటు చేసి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చర్చించాలన్నారు.

గురుకులాల్లో సీట్లు భర్తీ చేయండి



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ఎస్సీ సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో సీట్లను భర్తీ చేయాలంటూ ఎస్సీ సంఘాల నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు శాంతకుమార్, ఎంఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.పి.నారాయణ స్వామి మాట్లాడారు. అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో దాదాపు 350 సీట్లు ఉన్నాయన్నారు. సీట్ల కేటాయింపులో అధికారులు అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే క్రమంలో అర్హులైన విద్యార్థులకు సీట్లు కేటాయించాలన్నారు. అనంతరం డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర పధాన కార్యదర్శి నాగేస్, బీబీఎస్ రాష్ట్ర నాయకుడు సిద్ధార్థ బాబు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ సంఘం నాయకుడు మధు, అప్పా అధ్యక్షుడు వెంకీ, ఎమ్మార్పీఎస్ నాయకులు చంద్ర, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు ప్రారంభం



ఈ-క్రాప్ చేస్తున్న ఏఓ సుచరిత, వీఎస్ఏ భాగ్యలక్ష్మి

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి సుచరిత తెలిపారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. రైతులు సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ బుకింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవడం ద్వారా ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, పంట నష్టపరిహారాలు అందుతాయని తెలిపారు. రైతుల పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ-క్రాప్ బుకింగ్ దరఖాస్తు పూరించి, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, వ్యక్తిగత బ్యాంక్ ఖాతా నంబర్, ఫోన్ నంబర్‌తో రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందికి ఇవ్వాలన్నారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ఈ-క్రాప్ చేసే వ్యవసాయ సిబ్బంది ఫోన్ నంబర్లు ఈ కింద ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆత్మకూరు 9182213626, పి.యాలేరు 6300140715, ముట్టాల 9966337356, సనప 7995658310, బి.యాలేరు 9703924636, మదిగుబ్బ 9676223310, తలుపూరు 8297918858, పంపనూరు 9573496981, వేపచెర్ల 8919827115, తోపుదుర్తి 9703924636.

ఆత్మకూరు తహసీల్దార్‌గా లక్ష్మీనాయక్

ఆత్మకూరు: మండల నూతన తహసీల్దార్‌గా లక్ష్మీ నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్, వీఆర్వోలు నూతన తహసీల్దార్‌కు పూలమాల వేసి స్వాగతం పలికారు. గతంలో ఈయన పెద్దపప్పూరు మండలంలో తహసీల్దార్‌గా ఉంటూ ఎన్నికల విధుల్లో భాగంగా అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు. ఎన్నికలు ముగియడంతో ప్రస్తుతం ఆత్మకూరు మండలానికి తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ప్రజజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్‌గా లక్ష్మీ నాయక్ తెలిపారు.

రాప్తాడు తహసీల్దార్‌గా విజయకుమారి

రాప్తాడు: మండల తహసీల్దార్‌గా పి.విజయ కుమారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల సమయంలో కుందుర్పి మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఈమెను అన్నమయ్య జిల్లాకు బదిలీ చేశారు. అక్కడి నుంచి రాప్తాడు తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు, డీలర్లు స్వాగతం పలికారు. దుశ్శాలువాలతో సన్మానించారు.

నవజాత శిశువుకు తల్లిపాలే అమృతం



ఆత్మకూరు మండలం మదిగుబ్బలో గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొండమ్మ



రాప్తాడు: తల్లిపాల వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ ప్రసన్న

రాప్తాడు: నవజాత శిశువులకు తల్లిపాలే అమృతమని ఎంఎల్‌హెచ్‌పీ ప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్త మాధవి పేర్కొన్నారు. సోమవారం చిన్మయనగర్-2 అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బిడ్డ పుట్టిన మరుక్షణం నుంచే ముర్రుపాలు పట్టించాలన్నారు. అన్ని రకాల పోషక విలువలు కలిగి వ్యాధి నిరోధక శక్తిని కలిగి ఉంటుందన్నారు. తల్లికి రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ రాకుండా నివారిస్తుందన్నారు. అనంతం చిన్నారులు, గర్భిణులు, బాలింతలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం చంద్రకళ, అంగన్‌వాడీ సహాయకురాలు సులోచన, ఆశా కార్యకర్తలు శివలక్ష్మి, నాగేంద్రమ్మ, వీరమ్మ, లక్ష్మి, పాల్గొన్నారు.

ఆత్మకూరు: పుట్టిన బిడ్డలకు తల్లిపాలు ఇస్తే ఆరోగ్యంగా ఉంటారు. తల్లిపాల ద్వారా బిడ్డలకు పౌష్టికాహారం అందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవాణి తెలిపారు. సోమవారం మండలంలోని మదిగుబ్బ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు.

బిడ్డకు తల్లిపాలు తప్పనిసరి

అనంతపురం సెంట్రల్: పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు తప్పనిసరిగా పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొండమ్మ పిలుపునిచ్చారు. సోమవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నగరంలో ఓబుళదేవర నగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పుట్టిన గంటలోపు బిడ్డకు తల్లిపాలు పట్టించాలన్నారు. ఇతర ఏ ద్రవ పదార్థాలను ఇవ్వరాదని సూచించారు. మొదటి ఆరునెలలు తప్పకుండా తల్లిపాలు ఇవ్వడం ద్వారా బిడ్డ సరైన ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది రేవతి, శైలజ, స్రవంతి, రమ్యకృష్ణ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి: తల్లిపాలే బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ఇచ్చే ముర్రు పాలు చాలా ఆరోగ్యకమైనవన్నారు. పౌష్టికాహార పదార్థాలు గుడ్లు, పాలు, కూరగాయలు, పండ్లను గర్భిణులు, బాలింతలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, అంగనవాడీ వర్కర్లు, హెల్పర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పీజీలో నైపుణ్యాభివృద్ధి కోర్సులు

అనంతపురం: పీజీలో నైపుణ్యాభివృద్ధి కోర్సులకు ప్రాధాన్యత ఇవ్వాలని బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశంలో నిర్ణయించారు. సోమవారం ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ బి. అనిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలకమైన అంశాలపై చర్చ జరిగింది. నూతన జాతీయ విద్యా విధానం-2020కు అనుగుణంగా పీజీ కోర్సుల్లో మార్పు చేర్పులు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పీజీ కోర్సుల రూపకల్పన చేయనున్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ. కృష్ణకుమారి, డీన్‌లు ప్రొఫెసర్ నరసింహన్, ప్రొఫెసర్ సత్యనారాయణ, ప్రొఫెసర్ నాగభూషణ రాజు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందాలి

చెన్నేకొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సెల్వియా సాల్మాన్ వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం మండల పరిధిలోని ప్యాదిండిలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను పర్యవేక్షించారు. ఎన్ఎస్ గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ రవినాయక్, వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. గ్రామంలోని గర్భిణులు, వృద్ధులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.